

# దేవుని ఆశీర్వాదములు?!

## God's Blessings?





దైవాశీర్వాదములు అనేమాట వినబడగానే క్రైస్తవులైన వారిలోనున్న కటిక దరిద్రుని నుండి ఆగర్భ శ్రీమంతుని వరకు ఒక రకమైన ఆశ చిగురించి, ఆ ఆనందముతో ముఖములో మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఇక బైబిల్ తెలియని వారిని గూర్చి చెప్పాల్సిన పనిలేదు. మన తరంలో కూడా చిన్నవారు మొదలుకొని కాటికి కాలుచాపుకొన్న వృద్ధుల వరకు మమ్మల్ని దేవుడు ఆశీర్వదించాలని ఎదురుచూస్తూ దైవాశీర్వాదం కొరకు దివారాత్రులు ప్రార్థించుచూ, ఆయనను పూజిస్తున్నారు. చాలామంది పాస్టర్లు దైవాశీర్వాదం కోసమే సువార్త సభలను ఆశీర్వాద పండుగలుగా మార్చేస్తున్నారు. ఆశీర్వాదాలకోసమే ఉపవాస, కటుంబ, ఎడతెగని ప్రార్థనలు, యజ్ఞ, యాగాదులు, క్రతువులు జరిపిస్తున్నారు. బలులు, అర్పణలు, మొక్కుబడులు చెల్లించేవారు, పుణ్యక్షేత్రాలు – పవిత్ర స్థలాలు దర్శించే వారనేకులు మనలో ఉన్నారు.

నేటి పాస్టర్లు ఎవరింటికి ప్రార్థన కోసం వెళ్ళినా ఆ ఇంటివారు బ్రదర్ మాకోసం ప్రార్థించండి. కష్టాలు, ఇరుకులు, ఇబ్బందుల్లో ఉన్నాం, దేవుడు మమ్మల్ని ఆశీర్వాదించాలని మీ అనుదిన ప్రార్థనలో జ్ఞాపకం చేసుకోండి అనేవాళ్ళు ఎక్కువయ్యారు. ఈనాడు క్రైస్తవేతరులు (అన్యులు) ఎక్కడెక్కడో తిరిగి అలసి, సొలసి చివరి ప్రయత్నంగా యేసుక్రీస్తును నమ్మితేనే ఏదో ఒకటి కలిసి వస్తుందని క్రైస్తవులుగా మారుతున్నారు. ఇంతకీ దేవుడు మనలను ఎలా ఆశీర్వదిస్తాడని ఆశీర్వాదాలను ఆశిస్తున్న వారినడిగితే ఈ జీవితంలో జరిగే మేలులే కదండీ ఆ మాత్రం తెలియదా! బైబిల్లో ఎంతోమందిని డబ్బు, ఆస్తి, అంతస్తు, అధికారంతో ఆశీర్వదించిన దేవుడు మమ్మల్ని ఎందుకు ఆశీర్వదించడు? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. మానవజ్ఞానంతోనే ఆలోచించి మహోన్నతుని మహిమను మసి బూసి మారేడుకాయగా మారుస్తున్నారు. ఇంతకీ ఆశీర్వాదం అంటే ఏమిటి? ఈ పదం అర్థం ఏమిటి, ఇదెలా ఉద్భవించిందో వాక్యాను సారంగా చాలా జాగ్రత్తగా ఆలోచిద్దాం (మార్కు 4:22–24).

ఈ సకల చరాచర సృష్టిలోని జీవులలో జ్ఞానము – వివేకము కలిగిన నరుడొక్కడే ఆశాజీవి అని చెప్పక తప్పదు. నరుడికున్నన్ని ఆశలు – ఆశయాలు ఈ లోకంలో మరే జీవికి లేవు. ఈ ఆశలే లేకపోతే మనిషి జీవించలేడు. అది మానవుడి నుండి అధునాతన మానవుని వరకు ఈ ఆశల సౌధాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయే గాని తరగడం లేదు. ఆశించడం తప్పుగాదు కాని ఆశకు అంతు ఉండాలి. ఈ ఆశ దురాశగా మారితే అనగా ఆశించినది దొరక్కపోతే

నిరాశలో పడి, నిర్వేదంలోమునిగి నిత్యాగ్ని దండనపాలయ్యే ప్రమాదముంది. దురాశ గర్భమును ధరించి, పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణాన్ని కంటుందని బైబిల్‌లో యెషయా క్రీ.పూ. 700 సం॥ల క్రితమే చెప్పాడు. మనకు చేతగానివి, అందనివి మనం అందుకోలేనివి, అనగా ఆశించిన వాటిని వేరేవాళ్ళు ఉచితంగా ఇవ్వాలని ఆలోచించి వాటిని ఉచితంగా పొందే విధానాన్నే ఆశీర్వాదం అంటారు. ఆశను తృప్తిపరచుటకేనేమో ఆశీర్వాదమనే పదం పుట్టుకొచ్చింది అని గ్రహించగలము. అడిగితే ఇచ్చేది దానము, అడగకుండా ఇచ్చేది బహుమానమైతే ఈ రెండిటికి మించినది మన ఊహకందనిది లేదా అతీతమైనదే ఆశీర్వాదము అని చెప్పవచ్చు. బైబిల్ భాష్యంలో అయితే ఏ నరుడు ఇవ్వలేనిది, దేవుడు మాత్రమే ఇచ్చేది దైవాశీర్వాదం.

నేడు మన మధ్య ఉన్న సంఘాలలోని అనేకమంది బోధకులు, మీరు మా సంఘాలకొస్తేనే బహుగా ఆశీర్వదింపబడుతారని పదే పదే చెప్పి ఒక రకమైన హిప్నాటిజం చేస్తున్నారు. ఈ మధ్యనే వచ్చిన టి.వి. ఛానెళ్ళలోనైతే మరీ బరితెగించి కొందరు సువార్తికులు మా ప్రసంగం (అరగంటలో) విని ఆశీర్వాదాలు అందుకొన్న వారు మాకు వ్రాయండని, చందా తప్పక పంపమని, అలా పంపిన వారు ఎలా ఎక్కువగా ఆశీర్వాదింపబడ్డారో వెంటనే సాక్ష్యాలు చూపిస్తున్నారు. సంఘానికో, దేవునికో ఎంత డబ్బు ఇస్తే అంతకు రెండింతలు తిరిగి పొందుతారని మాయమాటలు చెప్పి తమ బ్యాంక్ బ్యాలన్స్ పెంచుకొంటున్నారే గాని, మీ డబ్బు పరలోకంలో మాత్రమే జమఅవుతుందని ధైర్యంగా చెప్పే దైవజనులే కరువై పోయారు. ఈ విషయంలో నాటి నుండి నేటి వరకు బోధింపబడుతున్న బోధనల పర్యవసానమే ప్రతి విశ్వాసిలో నరనరాన జీర్ణించుకునిపోయి కడకు దేవుని వాక్యాన్నే కాదనే అనగా బైబిల్‌ను నమ్మలేని స్థితికి చేరిపోయారు. ఇలాంటి వారితోనే మన ప్రభువైన యేసునామం అనేకచోట్ల దూషింపబడుతుంది.

క్రైస్తవులమని చెప్పుకొంటున్న వారిని దైవాశీర్వాదాలు అంటే ఎంటని ఎవరినడిగనా, ఆశీర్వాదమనగానే ఆస్తి, అంతస్తు, ఉద్యోగం, వ్యాపారాభివృద్ధి, పంటలో అభివృద్ధి, సమాజంలో మంచి హోదా, ఉన్నత పదవులు, విదేశాల్లో ఉద్యోగాలు చదువులు, రాజకీయ పలుకుబడి మరియు రాజకీయ నాయకత్వం ( వార్డు మెంబరు మొదలుకొని యం.ఎల్.ఏ. యం.పి., మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, దేశాధ్యక్షుడు) ఇలా ఎన్నో సంగతులను ఏకధాటిగా చెప్పేస్తున్నారు. ఇలాంటి శరీర సంబంధులిచ్చే సాక్ష్యాలను బట్టే క్రైస్తవేతరులలో గూడా ఈ విషయాలే బలంగా నాటుకొనిపోయి కేవలం శరీర అవసరాల కోసమే (ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా దెబ్బతిన్న వారే) ప్రార్థించమని చెప్పి ఎక్కువ మంది ప్రార్థనలకొస్తూ, క్రైస్తవులుగా మారుతున్నారు, కేవలం పాపక్షమాపణ, పరలోకం నిత్యజీవం కొరకు మాత్రమే మేము క్రీస్తు ప్రభువును దేవుని కుమారుడని నమ్ముకొన్నాము అని సాక్ష్యమిచ్చేవారున్నారా? ఆలోచించండి, మనిషి బలహీనతలను ఆధారం చేసుకొనే ఊరికో సంఘం, వాడకో సంఘాలు, సంస్థలు లేదా ఆశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నేటి మానవులందరి దైవభక్తి కేవలం లాభసాటి వ్యాపారంగా మారిపోయింది.

ఈ లోకాశలు, భూ సంబంధమైన ఆశీర్వాదాల ఆశలలోపడి, దేవుడు నిజంగా ఆయన ఇష్టానుసారంగా (వాక్యనుసారంగా) ఆశీర్వదించిన వారినే దరిద్రులుగా నిందించే స్థాయికి ఎదిగిపోయింది నేటి క్రైస్తవ్యం, క్రైస్తవేతర సమాజం, నేటి సంఘాలలో 95% మంది బోధకులు చెబుతున్న దైవాశీర్వాదములు బైబిల్‌కు భిన్నంగా ఉన్నాయంటే నమ్మలేక, ఈ సత్యం చెప్పిన వారి సంఘాలకు రాలేని దశలో ఎంతోమంది ఉన్నారు. క్రీస్తు సిలువ రక్తంతో రచించిన / చేసిన

నూతన నిబంధనలోని అపోస్తలుల బోధవైపు అనగా సిలువ వేయడిన క్రీస్తు బోధవైపు చూడక, ఆనాటి పాత నిబంధనలోని ప్రవక్తల బోధను, ఆనాటి వారిని ఆశీర్వదించిన వాక్యాలు మాత్రమే చూపెడుతూ ప్రజలను భ్రమపెట్టి తప్పుదారి పట్టిస్తున్నారు నేడు చాలామంది బోధకులు. దీనికి కారణం బ్రతుకుదెరువుకోసం మాత్రమే బైబిల్ చేతబట్టి కడుపే దేవుడుగా చేసుకొన్న ఇలాంటి సాతాను అనుచరులే అని దేవుని ప్రజలు వారి సాతాను తంత్రములను గ్రహించడంలేదు. అబ్రహామును, ఇస్సాకును, యాకోబును, యోబును, దావీదును, సొలోమోనును ఇలా మలాకి గ్రంథం వరకు దీవించబడిన వారిని చూపించి మాయ చేస్తున్నారు. కాని వారి (ఇశ్రాయేలీయుల) ఆజ్ఞలు వేరు, వారి సున్నతి వేరు, వారి దేశం (భూసంబంధమైనది - కనాను) పాలు తేనెలు ప్రవహించే ప్రదేశం వేరు అని అర్థం చేసుకోవాలి. క్రీస్తు సువార్తలో అపోస్తలుల బోధలో ఇదేది లేక మనం పరదేశులమని, పరసంబంధమైన ఆశీర్వాదం మాత్రమే మనదని జ్ఞాపకం చేసేవారే కరువైనారు. యేసు దేవుని కుమాడని నమ్మినా, నమ్మకపోయినా మనుష్యులందరికి ఈ శరీరసంబంధమైన ఆశీర్వాదాలు కష్టపడితే తప్పక దొరకుతాయని, దేవుడు పక్షపాతికాడని చేప్పేవారేరి?

అయినా ఆదికాండము నుండి అనగా ఆదాము నుండి ఇశ్రాయేలీయుల సమాజం వరకున్న ఆశీర్వాదమనే పదం. దేవుడు వారితో మాట్లాడిన విధానం చదివికూడా అర్థం చేసుకోలేక అంధులుగా మారిపోయారు. వాక్యము సెలవిచ్చినట్లుగా "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరుచు సువార్త ప్రకాశము వారికి (నాటి నుండి నేటి భక్తులందరికి) ప్రకాశింప కుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసి యున్నది" (2 కొరింథీ 4:4). అందుకే క్రైస్తవులలో ఆత్మీయ అంధకారాన్ని, ఎంత ఎక్కువ చదువు ఉన్నా బైబిల్ చదవరాని విద్యా విహీనతను పారద్రోలి నా తరంలో కొందరినైనా అగ్నిలోనుంచి లాగి రక్షించాలనే దేవుని ఆలోచన, ఆజ్ఞకు లోబడి, మరోసారి మీ అందరిచేత కాలాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి, బైబిల్‌ను చదివించి గ్రహింపజేసి, దాని ప్రకారం ప్రవర్తించే వారుగా దేవుని ముందు నిలబెట్టాలనే ఆశయంతోనే ఈ కరపత్రికను వ్రాయుచున్నాను (1 పేతురు 1:8, 2 తిమోతి 2:7, అపో.కా. 17:10,11, యాకోబు 1:20,21)

ఆదాము పాపం చేయక ముందు మరియు చేసిన తర్వాత కూడా దేవుని ఆశీర్వాదం గూర్చి దేవోక్తులలో చదువుదాం. " దేవుడు వారిని ఆశీర్వదించెను, ఎట్లనగా మీరు ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి...." (ఆది. కాం. 1:28, 9:7) భూమిని, దానిలోని సమస్తాన్ని మనమే లోబర్చుకోవాలి. ఆయనే మనకాధికారం ఇచ్చాడు. అయితే మనం ఎంత కష్టపడ్డా ఫలితం రానిది అదే దేవుని నిజమైన అనగా మనిషి అడగనిది. అనుకొనినది దేవుడే ఇచ్చిన ఆశీర్వాదం మనం పిల్లలను కనడమే, అందుకే నరుడు ఒంటరిగా ఉంటే ఆయనకే మంచిది కాదని అనుకొన్నాడు ( ఆది.కా. 2 :18). ఈ ఆశీర్వాదమే అబ్రామును అబ్రహాముగా, యాకోబును ఇశ్రాయేలుగా మార్చి మనుష్యులకు మనుష్యులను బహుమానంగా కని ఇవ్వడమే ఆశీర్వాదమని బోధించి, వారిని పిల్లలను కనమని ఆజ్ఞాపించాడు (ఆది.కా.ం 15:5,6, 16:10, 17:1-8,20, 22:15-18, 26:1-5, 28:1-4, 35:9-12, 48:3,4, 15-16) వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగా ఉండవలెను. (హెబ్రీ 13:4) అనియు, వివాహము దేవుని వలన కార్యమని (ఆది.కా. 24:50) ఆయనే ఎందుకు వ్రాయించెనో జాగ్రత్తగా ఆలోచించాలి.

ఈ తర్వాత ఇశ్రాయేలీయులు, దేవునియందు భయభక్తులు కలిగిన యోబు, దావీదు, సొలోమోను లాంటివారి చేతి పనిని దీవించి ఆస్తిపరులను చేసినా, దానిని వారు ఆశీర్వాదముగా చెప్పక పిల్లల పిల్లలను చూడడమే దేవుని ఆశీర్వాదమని కీర్తించారు." పిల్లలు (Children) యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము (ఆస్తి) గర్భఫలం ఆయన ఇచ్చు బహుమానమే, "యెహోవా యందు భయభక్తులు గలవాడు ఈలాగు ఆశీర్వాదించబడును" (కీర్తన 127 : 128 మరియు 107 : 30, 115:12-16) ఇలా పిల్లలే ఆశీర్వాదమని అర్థం అని నేటి చిన్నపిల్లలు, యవ్వనస్తులు, ముసలివారు గ్రహించడం లేదు. స్త్రీ పిల్లలను ఎక్కువ మందిని కంటేనే భాగ్యవతి (ధనవంతురాలు) అని ఒకనాడు అన్నారు. ఆమె గర్భం ధరించగానే శ్రీమంతం చేస్తారు. ఇంతకు పెళ్ళికార్డులోనే స్త్రీని చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి అని వ్రాస్తారు (చి॥ల॥సౌ॥) ఎంత ఆస్తిపరులైనా పిల్లలు లేని వారి బాధ వర్ణనాతీతమని, పెండ్లి అయినవారు కుమారుడు కావాలని ప్రార్థిస్తే కూతురు పుట్టడం, కూతురు కావాలంటే కొడుకు పుట్టడం ఎందుకు జరుగుతుందో తెలియని అయోమయంలో ఉండి, అర్థం కాక ఇది ఖర్మ, తమ గ్రహచారం, తలరాత అని సర్ది చెప్పుకొంటున్నారు. కాని ఇది మన ఖర్మగాదు, గ్రహచారం అంతకన్నా కాదు, స్త్రీలలో ఏలోపం లేదు, పురుషుల గొప్పతనం ఏ మాత్రం కాదు. దేవునికి కుమారుడు కావాలను కొంటే మనకు కొడుకు పుడతాడు, ఆయనకు కూతురు కావాలను కొంటే బిడ్డపుతుంది. ఇదిదేవుని సంకల్పం. ఆశీర్వాదం. ఇది పూర్తిగా అర్థంగావాలంటే నూతన నిబంధనలోని కెళ్ళాలి. ఈ లోతైన అర్థాన్ని లోకమర్యాదని పాతనిబంధనలోని వారికి వివరంగా చెప్పలేదు దేవుడు (ఎఫెసీ 3:3-11)

"ఎట్లనగా తన ప్రియుని (క్రీస్తు) యందు, తాను (దేవుడు) ఉచితముగా... యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులను పిల్లలనుగా స్వీకరించుటకై... జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను." (ఎఫెసీ 1:3-6). దేవునికి పిల్లలు కావాలి గాబట్టే అబ్రామును అబ్రహాముగా మార్చాడు, అందుకే మనం అడిగింది ఇవ్వక అడగకుండానే పిల్లలను ఆశీర్వాదంగా ఇస్తున్నాడు. అడిగితే ఇచ్చేది దానం, అడకుండా ఇచ్చేది బహుమానం కదా, అయితే నూతన నిబంధనలో కూడా పిల్లలే ఆస్తి అని, అయితే ఇది పరసంబంధమైనదేనని, అనగా మనతోపాటుగా పరలోకానికి తీసుకెళ్ళేది. పంపేది ఈ పిల్లలనే ఆస్తి అని, అదే ఆశీర్వాదం అని గ్రహించాలి. అయితే పిల్లలు లేనివారు ఆశీర్వదింపబడినవారు కారా? అని ప్రశ్నించే అవకాశం ఉంది గనుక, పిల్లలను వాక్యముతో కని అనగా దత్తత తీసుకొని క్రీస్తులో పెంచి పరలోకం పంపే వారు కూడా, వాక్యం ద్వారా కనడం మరియు పెంచడం చేయాలి, ఎందుకంటే పౌలుకు పెండ్లే కాలేదు అయినా అతడు ఆశీర్వదింపబడ్డవాడే, ఎందుకుంటే వాక్యం ద్వారా తీతును, తిమోతిని కన్నాడు గదా!.

అయితే ఈ అవకాశం కూడా ఉపయోగించుకొనని వారికి సిలువ వేయబడిన క్రీస్తు బోధలో మరో అవకాశం ఇచ్చాడు. ఇది కూడా చేస్తే ఆశీర్వాదింపబడినవారే, "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి – నా తండ్రిచేత ఆశీర్వదించబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి. దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి, దిగంబరినై ఉంటిని, నాకు బట్టలిచ్చితిరి, పరదేశినైయుంటిని నన్ను చేర్చుకొంటిరి, రోగినైయుంటిని నన్ను చూడవచ్చితిరి. చెఱసాలలో ఉంటిని చూడవచ్చితిరి.... అందుకు రాజు మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరని నిశ్చయంగా మీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 25:31-46) ఇలా లోకంలోని అనాధలను కూడా నిస్వార్థంగా తమకష్టార్జితంతో ఆదుకొన్న వారు కూడా

ఆశీర్వదింపబడిన వారేనని వాక్యం చెబుతుంది. దీంట్లో చిన్నా, పెద్ద, ఆడ, మగ, కులం, మతం తేడా లేదు కాని ఒక విషయం గమనించాలి. అదే మన స్వంత ఆస్తిలో భాగాన్ని ఖర్చు చేయవలెనే గాని ఎవరో దానం చేసింది కాదు. ధనం ఉచితంగా దేవుని నుండి పొందే విషయాలు బైబిల్‌లో లేవు సుమా (మత్తయి 6:19-24, 19:16-30).

ఇంకా మన పుట్టుకకు, బ్రతుకుకు, పిల్లలను దేవుని కోసం క్రీస్తులా పెంచుటకు, అనాథలను ఆదుకొనుటకు అనగా అన్నింటికి అవసరమైన, అసలు సిసలైన, మరి శ్రేష్టమైన నిబంధనలోని దేవుని ఆశీర్వాదములు మనకెలా వస్తున్నాయో చూద్దాం.

ప్రతి ఆదివారపు ఆరాధనలో, కుటుంబ ఆరాధనలో, స్వస్థత - ఉజ్జీవ - రక్షణ - సువార్త కూటములలో, శుభకార్యములు, జ్ఞాపకార్థ కూటములతో సహా అన్నింటి చివరిగా ముగింపు ప్రార్థన చేశాక అయ్యగారు (పాస్టర్లు) ఇచ్చే దేవుని ఆశీర్వాదములు తీసుకొని ఇంటికెళుతాం. అయితే దేవుని ఆశీర్వాదం ఇచ్చే వాడికి తీసుకొనే వాడికి ఇది ఓ అలవాటు - ఆచారంగా మారిందే గాని అందులోని పరమార్థం మాత్రం ఎవ్వరూ జాగ్రత్తగా గ్రహించుటలేదు. ఈ రోజుల్లో అసలైనది ఈ ఆశీర్వాదముల ద్వారానే మనం పరలోకం చేరవలసి ఉందని చాలామంది ఆలోచించలేకపోతున్నారు. పైగా ఈ ఆశీర్వాదం తీసుకోకుండా ఎవ్వరూ లేవద్దని, ఇంటికెళ్ళకూడదని గట్టిగా చెబుతుంటారు. సభా నిర్వాహకులు, బోధకులు, కాని అనేకులు దానిని పట్టించుకోరు. అదేనండి "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, తండ్రియైన దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ (మన) కందరికిని తోడైయుండును గాక!...." (2 కొరింథీ 13:14). వరుసక్రమం అప్పుడప్పుడు అటు-ఇటు అయినా ఇదే ఆశీర్వాదమని గ్రహించి ప్రవేశపెట్టినవారు ధన్యులు సుమా. అదెలాగో జాగ్రత్తగా ఒక్కొక దానిని ధ్యానిద్దాం. ఇందులో కూడా ధనానికి, చర స్థిరాస్థులకు, పదవులకు అనగా శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములకు ఎంతమాత్రం స్థానం లేదు.

**తండ్రియైన దేవుని ప్రేమ** : దేవుని ప్రేమ అనగానే ఈ లోకంలోనే ఆయనిచ్చే ఉద్యోగం, ఆస్తి, అంతస్తు కార్లు మొదలుగునవి ఎన్నో అనే భ్రమలో ఉన్నారు. అయితే మరోసారి చదవండి సత్యవాక్యాన్ని "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను 3:16, 5:24).

"మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమ యున్నది. (1యోహాను 4:7-11). దీనిని పూర్తిగా వివరించాలంటే ఈ కరపత్రము సరిపోదు. నేను వ్రాసిన పుస్తకం. "**మానవ మేథస్సుకందని ప్రేమ**" చదవండి. అయితే ఈ లోకంలో మనం బ్రతకడానికి కావల్సిన తిండి. బట్ట ఇచ్చి తండ్రిగా తన బాధ్యత నెరవేరుస్తూ, మనం పాప విమోచన పొంది పరలోకం వెళ్ళడానికి, మనం అడగకుండానే క్రీస్తుతో సిలువయాగం చేయించడంలోనే దేవుని ప్రేమ ఉన్నది. ఈ ప్రేమ దేవుడిచ్చిన గొప్ప ఆశీర్వాదం. దీనికిమించిన ప్రేమ ఈ లోకంలో ఏది లేదు. ఏది వద్దు కూడా. దేవుడిచ్చిన ఈ ప్రేమ కావాలని దివారాత్రులు ప్రార్థించిన ప్రార్థిస్తున్న వారెందరున్నారో ఆలోచించండి. ఈ ప్రేమతోనే మనం మన పొరుగు వారిని ప్రేమించాలి.

**ప్రభువైన యేసుక్రీస్తు కృప** : "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను." (2 కొరింథీ 8:9). కృప అనే పదానికి ఇంగ్లీష్‌లో గ్రేస్ అని

చెప్పాడు. దాని అర్థం జాలి, కరుణ, దయ అనే పర్యాయ పదాలకు సరిపోతుంది. ఈ లోకాన్ని సృష్టించిన వాడు అనగా ఈ భూమికి ధరకడితే ఎంతటి ధనవంతుడో ఆలోచించండి. ఈభూమి మీదనున్న మనల్ని ధనవంతులనుగా చేయడమే ఆయన కృప అంటున్నాడు. దీనిని పైపైన చూసిన మూర్ఖులు యేసు దగ్గరకొస్తే ధనవంతులవుతారని భ్రమపడుతున్నారు. ధనవంతుడు పరలోకం చేరడని, నీ ధనాన్ని అమ్మి బీదలకిచ్చి నన్ను వెంబడించమన్న దేవుని వాక్యము (మత్తయి 6:19-24, 19:16-27, మార్కు 10:17-27, లూకా 18:18-27, 12: 13-21, 1 తిమోతి 6:3-10)లను మరచిపోయారు. ఒకని కలిమి విస్తరించుట వాని జీవానికి (లోకంలో బ్రతకడానికి కూడా) మూలం కాదన్నాడంటే (లూకా 12:15) ధనం ఎంతటి రక్తపిశాచో దేవుని అనుగ్రహం అనగా ఈ క్రీస్తు కృప పొందిన వారికే అర్థం అవుతుంది. మట్టిబుర్రతోనూ, మనుషుల సాక్ష్యాలను నమ్మిఆలోచిస్తే ఆగమైపోయి, అక్రమము చేసినవారమైతాము

దేవుడిచ్చే ఈ ధనం లేక ఐశ్వర్యం విషయమైన కృప ఏమిటని ఆలోచిస్తున్నారు గదా! చదవండి. "క్రీస్తును గూర్చిన జ్ఞానం మీలో స్థిరపరచబడినందున, జ్ఞానములోను ఐశ్వర్యవంతులైతిరి." (1 కొరింధీ 1:6, 4:7). వారి తొట్రుపాటు లోకానికి ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు (మనకు) ఐశ్వర్యమును అయినయెడల, వారి పరిపూర్ణత యెంత ఎక్కువగా ఐశ్వర్యకరమగును" (రోమా 11:11-14). లోకంకన్నా లోకాన్ని కలిగించిన వాక్యం చాలా ఖరీదైనదగును గదా! ఆ వాక్యాన్ని ఇశ్రాయేలీయుల నుండి తీసివేసి మన స్వంతం చేయడానికి క్రీస్తు భూ లోకానికి వచ్చాడు. ఈ (లోకాంతం) యుగసమాప్తి వరకు మనతో (ఆయన నమ్మినవారితో) ఉంటానన్నాడు క్రీస్తు. దేవుని ఆజ్ఞ ప్రకారం మాత్రమే కాక మనయెడల ఆదేవుని జ్ఞానానికి అనగా ధర్మశాస్త్రానికి మించిన ప్రేమ, దయ కరుణతో మనకోసం సిలువలో మరణించాడు. ఇది ఆయన చూపిన కృప, ఈ కృప మన జీవితాంతం వరకు స్వతంత్రించుకొంటాం. గనుక, దేవుని వాక్యం అనగా యేసుక్రీస్తు దగ్గరున్న వాడే ప్రపంచంలో అందరికన్నా ధనవంతుడు కాదా! దీనిని దైవాశీర్వాదమనాలా వద్దా? ఆలోచించి గ్రహించండి. క్రీస్తు కృపయే ఎల్లప్పుడు ఈనాటి మనుషులందరికి అత్యవసరంగా కావాల్సినది. (రోమా 5:15-21). అయితే నేడు దేవుని మెప్పు, క్రీస్తు కృపకన్నా మనుష్యుల మెప్పును పొందాలనుకొనే బోధకులు తద్వారా విశ్వాసులనబడినవాడు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నారు.

**పరిశుద్ధాత్మ సహవాసము :** సృష్టి ఆరంభం నుండి, ఈ సృష్టి అంతం వరకు పరిశుద్ధాత్మ మనకు వివిధ పేర్లతో కనిపిస్తాడు. అయితే యేసు పరలోకం వెళ్ళాక మనం అనాథలం కాక, ఎల్లవేలల్లో ఆదరణ పొందుటకై సదాకాలము మనతో ఉండటానికి ఆయనను మనలోనికి పంపాడు. ఆయన మనలో ఉంటే మనం దేవుని పిల్లలం కాగలం, శరీర క్రియలను చంపి నీతిమంతులం కాగలము (రోమా 8:9-26). పరిశుద్ధాత్మ ఉంటేనే క్రీస్తును ప్రభువని చెప్పగలం. ఆత్మ ద్వారానే తండ్రికి ప్రార్థన, విజ్ఞాపనలు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించగలము. ఆత్మ సహాయం ఉంటేనే వాక్యాన్ని అర్థం చేసుకోగలము, బోధించగలము, అనేకమైన తప్పుడు బోధలను ఖండించి, బుద్ధి చెప్పి, సరిదిద్దగలము (1కొరింధీ 2:10-15). దేవుని ఆరాధించాలంటే ఈ ఆత్మ సహవాసం, సహాయం తప్పనిసరి (యోహాను 4:24). దీనిని దేవుడే మనకు ఉచితంగా ఇచ్చాడు. దీనినే ఎక్కువగా అడుగమన్నాడు. ఒకప్పుడు ఇశ్రాయేలీయులను ఆయన కోసం కనిపెట్టమన్నాడు. ఇప్పుడైతే బాప్తీస్మం తీసుకోగానే అడగకుండానే వరంగా (అపో.కా. 3:38) అనగా ఆశీర్వాదముగా ఇస్తున్నాడు. గనుక ఈ ఆశీర్వాదం గూడా ఎంతో ముఖ్యమైనది. దీనిని ఆశీర్వాదంగా ఆశిస్తున్న వారెంతమంది ఉన్నారో మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి (2 కొరింధీ 13:5,6).

ఇప్పటికైనా దేవుని మనస్సు నెరిగి ఆత్మతో ఆలోచించే విశ్వాసులు గ్రహించారనుకొంటాను, వాక్యానుసారమైన దైవాశీర్వాదమంటే ఏమిటో. ఇంకా మూర్ఖంగా ఏదైనా పాతనిబంధనలోని రిఫరెన్స్ తీసి నాతో వాదించాలను కొంటున్నారా? అయితే మనం దేవునిని నమ్ముకొన్న వాళ్ళం. కాని దేవుడే ఎంచుకొన్న లోకసంబంధులైన ఇశ్రాయేలీయుల నుండి (ఆస్తి, అంతస్తులే ఆశీర్వాదాలుగా రుచిచూసిన వారినే) ప్రత్యేకంగా పట్టుకొన్న అపోస్తలులను ఆశీర్వదించిన విధానం చదవండి మీ చేతిలో ఉన్న బైబిల్ తీసి 1 కొరింథీ 4:8-13, 2 కొరింథి 4:7-12, 6:3-10, 11:18-28, మరి ముఖ్యముగా ఈ లోకంలో దొరికే మేలుల (ఆశీర్వాదాలను కొని) కొరకే క్రీస్తునందు నిరీక్షణ కలిగి యుంటే మనుష్యులందరికంటె (నమ్మనివారికంటే) దౌర్భాగ్యులము అని చెప్పాడు (1 కొరింథీ 15:19). ఈ కాలంలో యేసు ఎవరి ఇంటికొస్తే వారికి రక్షణ వస్తుంది. అయితే వారి ఇంట్లోంచి ధనం వెళ్ళిపోతుంది (లూకా 19:1-10). ఇది నమ్మిన మొదటి శతాబ్ధపు క్రీస్తు సంఘం తమ చరస్థిరాస్తులను అమ్మారు (అపో.కా. 2:43-47, 4:32-35, 5:1-11). ఈ సంగతులు నేటికి బైబిల్‌లో ఉన్నా, వాటిని బోధించే బోధకులు, వారి బోధ మారింది గనుకనే దైవాశీర్వాదాల పేరిట దేవుని సంఘం (చర్చి) ఆస్తులను అమ్మి తమ ఇండ్లు కట్టుకొంటున్నారు నేటి క్రైస్తవులు. పైగా మమ్మల్ని దేవుడు బహుగా ఆశీర్వదించాడని చెబుతున్నారు. ఇది అక్రమం, అన్యాయం.

కష్టపడ్డ ప్రతి వారికి కడుపు నిండుతుందని ఆదాము నుండి నేటికి చెబుతున్నాడు దేవుడు (ఆది కాం. 3:17-23, 2థెస్స 3:6-12) ప్రపంచంలో అన్యజనులకందరికి అపోస్తలుడైన పౌలు తన చేతులతో కష్టపడ్డాడు. (అపో.కా. 20:33-35). అపోస్తలులు కూడా స్వహస్తాలతో పనిచేశారు. దేవుని నీతిని రాజ్యాన్ని మొదట వెతికితే. తిండి, బట్ట ఇస్తాడని యేసు చెప్పాడు. సువార్త చెప్పేవాడు సువార్తవలన మాత్రమే జీవించాలంటే, సంఘం ఇచ్చేది సరిపోదని విదేశీ డబ్బు కాశపడి అన్యాయమైపోతున్నారు. ఇక్కడ సువార్త సేవజేసినందుకు జీతం ఇక్కడే పొందితే, ప్రభువు రెండవ రాకడలో అసలైన జీతం తేడనే సంగతి వారికి ఆలోచనకే రావడంలేదు. కావున డబ్బు, ఆస్తి అంతస్తులు, ఉద్యోగం (స్వదేశీ-విదేశీ) పదవి, లోక నాయకత్వం, విదేశీ ధనం, కార్లు ఇవేవి దేవుని ఆశీర్వాదాలు కావు, వీటిని మనమైనా అన్యులైనా కష్టపడితే సంపాదించుకోగలము, ఈ అంశము పూర్తిగా అర్థం కావాలంటే నేను వ్రాసిన "**యెహోవా కట్టిన ఇల్లు**" పుస్తకం కూడా చదవగలరు. ఉచితంగా నైనా మరే విధముగానైనా సరే డబ్బు వచ్చి, మనవద్ద నిల్వ ఉంటుందంటే మనం దేవునికి దూరంగా జరిగిపోతున్నట్లే ఇది అక్షరాల సత్యం (లూకా 16: 8-13, 2 తిమోతి 6:3-10, 17-19). మనకు పనికి మాలిన ఈ లోక ఆస్తులు, డబ్బులు ఇచ్చి మనలను దూరం చేసుకొంటాడా! ఆలోచించండి. ఆనాటి ఇశ్రాయేలీయులు లోక సంబంధులే గనుక వారి ఆశీర్వాదాలు శరీర అవసరాలు తీర్చేవే క్రైస్తవులు పరలోక సంబంధులు గనుక మనకు పరసంబంధమైన ఆశీర్వాదాలనే అనుగ్రహించాడు. (ఎఫెసీ 1:3-6).

ఎవరో కొనిచ్చిన కారు దేవుడిచ్చిన గిఫ్ట్ అంటే అది 15 సం॥ల తర్వాత పనికిరాదని ఆర్.టి.ఎ. వారంటున్నారు. కష్టపడి, అప్పుచేసి కట్టుకొన్న ఇల్లు గాడ్స్ గిఫ్ట్ అనుకొంటే 50,100 సం॥లలోపే కూలిపోతుంది. ఉద్యోగం దేవుడి బహుమానం అంటే 60 సం॥ల వయస్సు రాగానే రిటైర్మెంట్ ఇచ్చి గెటౌట్ అంటుంది. గవర్నమెంటు. అయితే దేవుని ఆశీర్వాదం దేవుడున్నంత కాలం నాశనం లేకుండా ఉంటుందని, అదేమన పిల్లలు అనియు మరియు దేవుని ప్రేమ, క్రీస్తు కృప, పరిశుద్ధాత్మ సహవాసం అని మరచిపోకుండా వీటికోసం మాత్రమే భయ-భక్తులతో

కనిపెట్టండి. దివారాత్రులు ప్రార్థించండి. దేవుడిచ్చే ఈ ఆశీర్వాదాలు, ఆస్తి, అంతస్తులు తిరిగి దేవుని చెంతకు మనలను, మనపిల్లలను చేర్చినపుడే మనుషులందరి జీవిత పరమార్థం నెరవేరి, దేవుని చిత్తము సంపూర్ణ మవుతుంది.

మట్టి నుండి పుట్టిన దేహం తిరిగి మట్టిలోనే కలిసి, కాలి పోకుండా నిత్యజీవాన్ని పొంది పరలోకం వెళ్ళాలంటే దేవుడిచ్చే పర సంబంధమైన ఆశీర్వాదాలనే కోరుకొండి. సాతాను బోధకుల మాయమాటల నుండి, చమత్కారమైన కల్పిత కథలు, ఎ/సి. హాల్స్, టెంపుల్స్, హంగామాలు, కంప్యూటరైజ్‌డ్‌గేట్లు, ఐ.డి.కార్డులు, గిఫ్టులు, సినిమాక్లిప్పింగులు, శవపేటికలు, సమాధుల స్థలాలు, స్కూల్స్, హాస్టలల్లో సీట్లు మొదలైన శరీరసంబంధమైన ఆశల జోలికి వెళ్ళకుండా, అనేకులను వెళ్ళనీయకుండా నిత్యజీవం కోసం నిరంతరం పరితపిస్తూ దివారాత్రులు వాక్యాన్ని ధ్యానించి, పరిశోధించి, విశ్వాసాన్ని కాపాడుకొని యేసు రెండవ రాకడలో మన పరలోకానికి తిరిగి చేరుకొందాం! అంత వరకు దేవుని పరదైసులో నెమ్మది పొందుదాం.

వ్రాయబడిన ఈ అంశంపై ఇంకా ఏమైనా సందేహాలు, సమస్యలుంటే నన్ను నేరుగా సంప్రదించి సమాధానం పొందండి. మరియు దేవుని వాక్యానుసారంగా లేకపోతే నన్ను సరిదిద్దండి. సకలాశీర్వాదాలకు కారణభూతుడైన దేవాది దేవుని ప్రేమ, ప్రభువైన యేసుక్రీస్తు కృప, పరిశుద్ధాత్మ సహవాసము, సమాధానము సదాకాలము మనందరికి సదాకాలము తోడైయుండును గాక....

జీవముగల దేవుని సంఘంలో మీ సోదరుడు
**డా॥ బొంకూరి జాన్**




మేము దేవుని కుమారుడు, దేవుని శక్తి, జ్ఞానమైన సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. 1 కొరింథి 1:22-24


**INSTITUTE OF BIBLE TECHNOLOGY - HYD**
**" TEMPLES OF GOD" CHURCH**
**(CHRIST THE SON OF GOD MINISTRIES)**
**దేవుని మహాజ్ఞాన సాంకేతిక విద్యాలయం - దేవాలయాల సంఘం**

HAL రాఘవేంద్రకాలని, Indian Oil పెట్రోల్‌బంక్ వెనుక, సుచిత్ర X రోడ్ పోస్టు,
కుత్బుల్లాపూర్, హైదరాబాద్ - 500 067. ఫోన్ : 040 - 20000700, సెల్ : +91 9440142887.

www.bibletechnology.net.,

E-mail : johnbonkuri59@gmail.com; bibletechnology@gmail.com


ఉచిత కరపత్రాలు, బైబిల్ ట్రైనింగ్, పుస్తకములు, ఆడియో & వీడియో సి.డి.ల కొరకు సంప్రదించండి.


బ్రదర్ జె. రవి (అడ్మినిస్ట్రేట్ మరియు కరస్పాండెంట్) నెం. 7-1-38/1/33, బాబు జగ్గజ్జీవనరామ్ నగర్, అమీర్‌పేట,
హైదరాబాద్ - 500016, ఫోన్ : 9440 792 192, 9676 744 233, 9700 600 270,
9948 338 410, 9701 658 187, 9912894005, 8106299985, 9912051394


IBT/2017

For Distribution in Churches only

"కులం-కుళ్ళు" "మత్తం-మత్తు" "ధనం-దగా""మనిషి-మాయ""దేవుడే-దిక్కు" సత్యమేవ జయతే!

krupasannidhi Graphics HYD.Cell:9396965131